క్లుప్తంగా

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన ఇంటూరి చిన్నా



జగ్గయ్యపేట అర్బన్: రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని జగ్గయ్యపేట మున్సిపల్ మాజీ చైర్మన్ ఇంటూరి రాజగోపాల్ (చిన్నా) మంగళవారం కడప జిల్లా పులివెందుల వెళ్లి మర్యాదపూర్వకంగా కలిసినట్లు ఒక ప్రకటనలో తెలిపారు.

అన్న క్యాంటీన్ భవనం పరిశీలన

నందిగామ: పట్టణంలోని అన్న క్యాంటీన్ భవనాన్ని మంగళవారం ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రూ.9 లక్షలతో అన్న క్యాంటీన్ మరమ్మతులు చేస్తున్నట్టు తెలిపారు. త్వరలోనే క్యాంటీన్ ప్రారంభించ డంతోపాటు నిత్యం నాణ్యమైన ఆహారాన్ని అందజేసి పేదల ఆకలి తీర్చనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు ఏచూరి రాము, పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

డయేరియా కంట్రోల్‌లోనే ఉంది

–డీఎంహెచ్‌వో సుహాసిని



జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట ప్రాంతంలో డయేరియా వ్యాధి అదుపులోనే ఉందని జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఎం.సుహాసిని తెలిపారు. ఈ సందర్భంగా ఆమె సాక్షితో మాట్లాడుతూ ఈ నెల 19వ తేదీ నుంచి ఇప్పటి వరకు 90 మంది డయేరియా వ్యాధితో జగ్గయ్యపేట ప్రభుత్వాస్పత్రిలో చేరగా, వారిలో 8 కేసులు విజయవాడ జీజీహెచ్‌కు రిఫర్ చేశామన్నారు. మిగిలిన వారికి చికిత్స అందించి పూర్తిగా నయం అయిన తరువాత 46 మంది డిశ్చార్జి అయ్యారని, ప్రస్తుతం మంగళవారం చేరిన 12 మందితో కలిపి మంగళవారం సాయంత్రానికి 36 మంది పేట ప్రభుత్వాస్పత్రిలో బెడ్‌ల మీద ఉన్నారని తెలిపారు. చిల్లకల్లు (3 పడకలు), షేర్‌మహ్మద్‌పేట (5 పడకలు), వత్సవాయి మండలంలోని మక్కపేట (3 పడకలు)లతో 3 చోట్ల మెడికల్ క్యాంపులు పెట్టినట్లు తెలిపారు. పట్టణంలో ప్రభుత్వాస్పత్రి (సీహెచ్‌సీ), రెండు అర్బన్ హెల్త్ సెంటర్స్‌లో ప్రత్యేక డయేరియా చికిత్స సెంటర్లను ఏర్పాటు చేశామన్నారు. పేట ప్రభుత్వాస్పత్రి కంట్రోల్ రూమ్‌గా ఇక్కడ 108లు రెండు, సీహెచ్‌సీ అంబులెన్స్ సిద్ధంగా ఉంచినట్లు తెలిపారు. షిఫ్ట్‌ల వారీగా 24 మంది వైద్యులు పర్యవేక్షిస్తున్నారని, నందిగామ, విజయవాడ, మైలవరం నుంచి ప్రత్యేకంగా 18 మంది స్పెషల్ డాక్టర్లను, 10 మంది జనరల్ డాక్టర్లను ఏర్పాటు చేశామన్నారు. ఇక్కడ నుంచి జీజీహెచ్‌కు వెళ్లే పేషెంట్ల కోసం అక్కడ ముగ్గురు డాక్టర్లతో ఒక టీమును ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రెవెన్యూ, పంచాయతీ, ఆర్‌డబ్ల్యూఎస్ విభాగాలతో సమన్వయం చేసుకుంటూ ముందుకు పోతున్నామన్నారు.

పేటలో మున్సిపల్ ఆర్‌డీ పర్యటన

డయేరియాతో మరో 12 మంది ప్రభుత్వాస్పత్రిలో చేరిక



జగ్గయ్యపేట అర్బన్: డయేరియా పూర్తిగా అదుపులోకి రాలేదు. వారం రోజుల నుంచి జగ్గయ్యపేట నియోజకవర్గంలోని జగ్గయ్యపేట, వత్సవాయి మండలాలకు చెందిన పలు గ్రామాల నుంచి డయేరియా రోగులు వస్తూనే ఉన్నారు. కాగా కొత్తగా మంగళవారం పలు గ్రామాల నుంచి 12 మంది వాంతులు, విరేచనాలతో జగ్గయ్యపేట ప్రభుత్వాస్పత్రి (సీహెచ్‌సీ)లో చేరారు.

మరొక రెండు గ్రామాలకు విస్తరణ..

డయేరియా వ్యాధి మరొక రెండు గ్రామాలకు విస్తరించింది. మండలంలోని ముక్త్యాల, రావిరాల గ్రామాల్లో కూడా పలువురికి వాంతులు, విరేచనాలు మొదలయ్యాయి.

పట్టణంలో పర్యటించిన మున్సిపల్ ఆర్‌డీ..

పేట ప్రభుత్వాస్పత్రిలో డయేరియా పేషెంట్లు పెరుగుతుండంతో మున్సిపల్ రీజనల్ డైరెక్టర్, రాజమండ్రి సీహెచ్.నాగనరసింహారావు పట్టణంలోని పలు ప్రాంతాలలో పర్యటించారు. తాగునీటి శాంపుల్స్‌ను పరీక్షించారు. ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులను పరామర్శించి, వివరాలు అడిగి తెలుసుకున్నారు.

ప్రబలుతున్న డయేరియా

- భయాందోళనలో ప్రజలు
- గ్రామాల్లో లోపించిన పారిశుద్ధ్యం
- కలుషిత నీరే కారణమా..?
- ఇప్పటికి 36 కేసుల నమోదు



గ్రామ శివారులో రోడ్డు పక్కన అస్తవ్యస్తంగా చెత్తకుప్పలు

వత్సవాయి: మండలంలో పలు గ్రామాల్లో డయేరియా సోకడంతో ప్రజలు భయపడుతున్నారు. మండల కేంద్రం వత్సవాయిలో పాటు దబ్బాకుపల్లి, మక్కపేట, భీమవరం, మంగొల్లు, దేచుపాలెం, వేములనర్వ, పెద్దమోదుగపల్లి గ్రామాల్లో డయేరియా వల్ల ప్రజలు వాంతులు, విరేచనాల బారిన పడ్డారు. మండలంలో ఇప్పటివరకు 36 వరకు కేసులు నమోదయ్యాయి. డయేరియా బారిన పడ్డ వారికోసం వైద్యశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక క్యాంపులు ఏర్పాటుచేసి వైద్య సేవలు అందిస్తున్నారు. మండలంలో వత్సవాయిలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంతో పాటు మక్కపేట పంచాయతీ కార్యాలయంలో ప్రత్యేక వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఇక్కడ ప్రాథమిక చికిత్సలు అందించిన తరువాత పరిస్థితిని బట్టి మెరుగైన వైద్యం కోసం జగ్గయ్యపేట ప్రభుత్వాస్పత్రికి తరలిస్తున్నారు.

కనిపించని పారిశుద్ధ్యం..

వర్షాకాలం వ్యాధులకు మూలం. వ్యాధులు కూడా అంత వేగంగా వ్యాపిస్తాయి. పారిశుద్ధ్యం ఏ మాత్రం లోపించినా రోగాలు చుట్టుముడతాయి. వర్షాకాలంలో గ్రామాల్లో ముందస్తుగానే పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలి. సైడ్ కాలువల్లో పూడిక తీయడంతోపాటు వీధుల వెంట బ్లీచింగ్ చల్లించి, బావులు, బోర్లలో కూడా క్లోరినేషన్ చేయించాలి. రహదారుల వెంట ఉన్న చెత్త కుప్పలు తొలగించాలి. దోమల మందును స్ప్రే చేయించాలి. తాగిపడేసిన కొబ్బరి బోండాలను గ్రామ శివార్లలో వేసేలా చర్యలు తీసుకోవాలి. హోటళ్లు, పానీపూరి బండ్లు, కొబ్బరిబోండాల వ్యాపారులు, చికెన్‌షాపుల వద్ద పారిశుద్ధ్యం లోపించకుండా చూసుకోవాలి. మండలంలో డయేరియా కేసులు ఉండడంతో కొన్ని గ్రామాల్లో బ్లీచింగ్‌ను చల్లిస్తున్నారు.

రెండు కొత్త కేసులు నమోదు..

మంగళవారం నాడు రెండు డయేరియా కేసులు కొత్తగా నమోదు అయినట్లు వైద్యాధికారిణి సుష్మా ప్రియదర్శిని తెలిపారు. పెద్దమోదుగపల్లి, మంగొల్లు గ్రామాల్లో ఒక్కొక్కటి చొప్పున నమోదు అయ్యాయని తెలిపారు.

కలుషిత నీరే కారణమా..?

వాతావరణంలో మార్పులు వచ్చాయి. మొన్నటి వరకు ఎండలు మండిపోయాయి. ఇటీవల కాలంలో అడపాదడపా వర్షాలు పడుతున్నాయి. దీనివల్ల నీరు కలుషితమయ్యే అవకాశం ఉంది. మండలంలో ప్రధానంగా లింగాల మునేటి నుంచి అన్ని గ్రామాలకు తాగునీరు సరఫరా అవుతుంది. ముఖ్యంగా చిల్లకలు రక్షిత మంచినీటి స్కీం నుంచి 10 గ్రామాలకు పైగా తాగునీరు సరఫరా అవుతోంది. అయితే మక్కపేట వద్ద ప్రధాన పైపులైన్‌కు ఎక్కడికక్కడ అనధికారికంగా అక్రమ కనెక్షన్లను ఏర్పాటు చేసుకున్నారు. ప్రధాన రహదారి వెంట ఎక్కడపడితే అక్కడ అక్రమ కనెక్షన్ కోసం పైపులైనుకు రంధ్రాలు పెట్టడంతో సైడ్ కాలువల్లో ఉన్న కలుషిత నీరు పైపులైన్లలోకి చేరుతోంది. దీంతో పైపుల్లో నీరు కలుషితం అవుతోంది. పైపులైన్ లీకుల వల్ల ఈ కలుషిత నీరు సమస్య ఏర్పడుతోంది. గత పది రోజుల నుంచి నీరు కలుషితమై వస్తోందని చెబుతున్నారు.



మక్కపేట వైద్యశిబిరంలో బాధితులకు సేవలు అందిస్తున్న వైద్యసిబ్బంది

కాచి చల్లార్చిన నీరు తాగాలి



వర్షాకాలంలో ముఖ్యంగా పరిశుభ్రమైన నీటిని మాత్రమే తాగాలి. కాచి చల్లార్చిన నీటిని తాగితే ఇంకా మంచిది. షాపుల్లో అమ్మకాలు చేసే వాటర్ ప్యాకెట్లను తాగకుండా ఉండాలి. వర్షాకాలంలో వీధుల వెంట తినుబండారాలు తీనకూడదు. దీనితో పాటు ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి.

–సుష్మాప్రియదర్శిని, మండల ప్రభుత్వ వైద్యాధికారిణి

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



కంచికచర్ల అంబేడ్కర్ నగర్‌లో బ్లీచింగ్, సున్నం చల్లిస్తున్న సర్పంచి సునీత



గండేపల్లిలో రోడ్డుపై ఉన్న చెత్తా చెదారాన్ని జేసీబీతో తొలగిస్తున్న సర్పంచి రవికుమార్

కంచికచర్ల : ప్రజలు రోగాలబారిన పడకుండా పట్టణంలో ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని సర్పంచి వేల్పుల సునీత పేర్కొన్నారు. స్థానిక పెద్దబజార్, హనుమాన్‌పేట, సంజీవనగర్, అంబేడ్కర్ నగర్‌లలో మంగళవారం శానిటేషన్ పనులు చేపట్టారు. ఈ మేరకు సర్పంచి మాట్లాడుతూ సీజనల్‌గా వచ్చే వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని కోరారు. పలు వీధుల్లో రోడ్ల వెంబడి, మురుగుకాల్వల్లో బ్లీచింగ్, సున్నం చల్లించారు. పంచాయతీ కార్యదర్శి బ్రహ్మం, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

గండేపల్లిలో ప్రచారం..

సీజనల్‌గా వచ్చే వ్యాధుల నివారణకు ప్రజలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సర్పంచి బొక్కా రవి కుమార్ అన్నారు. గండేపల్లిలో సీఎస్ఐ దేవాలయం, వెంకటేశ్వరస్వామి ఆలయం మైకుల ద్వారా మంగళవారం ప్రచారం చేశారు. మాంసం విక్రయాలు జరపరాదని, కాచి చల్లార్చిన నీటిని తాగాలని ప్రచారం చేశారు. మురుగునీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. ఆర్‌సీఎం చర్చి వెనుక రోడ్డులో అపరిశుభ్రంగా ఉన్న చెత్తా చెదారాన్ని గత మూడు రోజుల నుంచి జేసీబీ సాయంతో తొలగించారు. అనంతరం బ్లీచింగ్, సున్నం చల్లించారు. పంచాయతీ కార్యదర్శి జిల్లేపల్లి రత్నాకర్ పాల్గొన్నారు.

గండేపల్లిలో తాగునీటికి కటకట

- వారానికి ఒక్క రోజే తాగునీటి సరఫరా
- ఇబ్బంది పడుతున్న ప్రజలు

కంచికచర్ల: మండలంలోని గండేపల్లిలో రక్షిత మంచినీటి పథకం ద్వారా వారానికి ఒకసారి తాగునీరు సరఫరా అవుతోంది. దీంతో ప్రతిరోజూ ఇతర ప్రాంతాలకు వెళ్లి తాగునీరు తెచ్చుకోవాల్సిన దుస్థితి నెలకొందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే వంద రూపాయలు ఇస్తే మీ బజార్‌కు తాగునీటిని పంపిస్తామని గ్రామ పంచాయతీ పంపు హౌస్ మెకానిక్ అంటున్నాడని మహిళలు ఆరోపిస్తున్నారు. పంచాయతీకి నీటి పన్ను ప్రతి ఏడాది చెల్లిస్తున్నామని, నీరు సరఫరా చేయాలని మహిళలు అంటున్నా.. అవసరమైతే ట్రాక్టర్ ట్యాంకర్ ద్వారా నీటిని తెచ్చుకోండని దబాయిస్తున్నాడని మెకానిక్‌పై మండిపడుతున్నారు. పాఠశాలలు, కళాశాలలు తెరిచి 12 రోజులు కావస్తోందని, విద్యార్థులను సకాలంలో బడికి పంపించాలంటే వారికి అవసరమైన భోజనం వండి పంపించాల్సి ఉంది. కానీ తాగునీరు లేకపోవటంతో భోజనాన్ని వండకుండా పంపిస్తున్నామని దీంతో విద్యార్థులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని తల్లిదండ్రులు వాపోతున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులు కూడా తాగునీరు సరఫరా కాకపోవటంతో సకాలంలో విధులకు వెళ్లలేకపోతున్నారు. మండలంలోని కీసర మున్నేటి ఒడ్డున రక్షిత మంచినీటి సరఫరా పథకం ద్వారా విద్యుత్ మోటార్లను ఏర్పాటు చేశారు. అయితే మోటార్లు సక్రమంగానే పనిచేస్తున్నాయి. ఒక్కోసారి మోటార్లు మరమ్మతులకు గురయినా సర్పంచి, పంచాయతీ కార్యదర్శి దగ్గరుండి సకాలంలో బాగుచేయిస్తున్నారు. కానీ పంపు మెకానిక్‌కు ఎవరు డబ్బులు ఇస్తే ఆ వీధుల్లోకి పైపుల ద్వారా నీరు వదులుతున్నాడని గ్రామానికి చెందిన మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా, మండల స్థాయి అధికారులు స్పందించి గ్రామానికి రక్షిత మంచినీటి పథకం ద్వారా తాగునీరు సక్రమంగా సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలని, ప్రజల నుంచి డబ్బులు వసూలు చేస్తున్న పంపు మెకానిక్‌ను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం

ఈ విషయంపై పంచాయతీ పరంగా చర్యలు తీసుకుంటాం. పంపు మెకానిక్ నీళ్లు వదలడానికి ప్రజల నుంచి డబ్బులు తీసుకుంటున్న విషయం ఇప్పటి వరకు తమ దృష్టికి రాలేదు. అయితే నీళ్లు రాకపోతే ట్యాంకర్ల ద్వారా తెప్పించుకోమని సర్పంచి రవికుమార్‌తో అన్నట్లు తెలిసింది. ఈ విషయంపై గ్రామంలో పూర్తి స్థాయిలో విచారణ చేపడతాం. అవసరమైతే మెకానిక్‌పై చర్యలు తీసుకుంటాం.

–జిల్లేపల్లి రత్నాకర్, పంచాయతీ కార్యదర్శి

నర్సరీ యజమానులకు అవగాహన



అవగాహనా సదస్సులో సూచనలు చేస్తున్న అధికారులు

నందిగామ: షేడ్ నెట్ నర్సరీలలో మిరప నారు పెంచే నిర్వాహకులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని ఉద్యాన శాఖ అధికారిణి నీలిమ సూచించారు. పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మంగళవారం వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి నియోజకవర్గ పరిధిలోని షెడ్ నెట్ నిర్వాహకులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ షేడ్ నెట్ నిర్వాహకులు తప్పనిసరిగా లైసెన్సు పొంది ఉండాలన్నారు. ముఖ్యంగా నాణ్యమైన విత్తనాలను కొనుగోలు చేసి మొక్కలను పెంచాలని సూచించారు. నర్సరీ నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. వ్యవసాయ శాఖ ఏడీఏ శ్రీనివాస్, మండల వ్యవసాయ శాఖ అధికారి ఖాసీం, నియోజకవర్గ పరిధిలోని నర్సరీ యజమానులు పాల్గొన్నారు.

మూఢ నమ్మకాల నియంత్రణ చట్టం తేవాలి

తిరువూరు: మూఢ నమ్మకాలకు అమాయక ప్రజలు బలవుతున్నారని, వీటి నియంత్రణకు ప్రభుత్వాలు చట్టాలు తీసుకురావాలని జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్. గంగాధర్ అన్నారు. సుందరయ్య భవన్‌లో మంగళవారం సమాజంపై మూఢ నమ్మకాల ప్రభావం అంశంపై జేవీవీ ఆధ్వర్యంలో అవగాహన సమావేశం నిర్వహించింది. ఆయన మాట్లాడుతూ శాస్త్రీయ దృక్పథం పెంపొందించేందుకు, మూఢ నమ్మకాల నిరోధానికి ప్రత్యేక చట్టాన్ని తీసుకురావలసిన అవసరం ఉందని చెప్పారు. జిల్లా ఉపాధ్యక్షుడు హరికృష్ణ, నాయకులు రాంప్రదీప్, సుధాకర్, సైదులు పాల్గొన్నారు.

గ్రామాల్లో తాగునీటిని పరీక్షించాలి

చిల్లకల్లు(జగ్గయ్యపేట): జగ్గయ్యపేట ప్రాంతంలో డయేరియా కేసులు వస్తున్న నేపథ్యంలో గ్రామాలలో ప్రజలకు సరఫరా చేసే తాగునీటికి పరీక్షలు నిర్వహించాలని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆర్‌డబ్ల్యూఎస్, విద్యుత్ శాఖాధికారులతో మంగళవారం ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగ్గయ్యపేట, వత్సవాయి మండలాల్లోని పలు గ్రామాల్లో డయేరియా వ్యాప్తి చెందటంతో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు తాగునీటి పరీక్షలు చేయాలన్నారు. ఆయా గ్రామాల్లో మంచి నీటి ట్యాంకులను క్లోరినేషన్ చేయించాలని తెలిపారు. కొన్ని గ్రామాల్లో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా ఉందని, పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. వర్షాకాలం కావటంతో విద్యుత్ అంతరాయం కలుగుతందని అధికారులు అప్రమత్తంగా ఉండి సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఎంపీడీవో రమేష్‌బాబు, విద్యుత్ శాఖ ఏఈ తారాచంద్, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ రమణ, తదితరులు పాల్గొన్నారు.

రేపు గురుకుల పాఠశాల ప్రవేశ పరీక్ష

ఎ.కొండూరు: కృష్ణారావుపాలెం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలుర పాఠశాలలో సీట్ల భర్తీకి ఈనెల 27న పరీక్ష నిర్వహిస్తామని ప్రిన్సిపాల్ కె. సిద్దయ్య మంగళవారం తెలిపారు. ఆరో తరగతి నుంచి తొమ్మిదో తరగతి వరకు ఉన్న ఖాళీ సీట్లను భర్తీ చేస్తామని చెప్పారు. ఆరో తరగతిలో ఎస్సీ–6, బీసీ–2, ఓసీ–1, ఏడో తరగతిలో ఎస్టీ–2, బీసీ–1, ఎనిమిదో తరగతిలో బీసీ–2, ఓసీ–1, తొమ్మిదో తరగతిలో బీసీ–1 ఖాళీలు ఉన్నాయన్నారు. ఆరోజు ఉదయం 10 గంటలకు పరీక్ష జరుగుతుందని, మెరిట్,రిజర్వేషన్‌ఆధారంగా సీట్లను భర్తీ చేస్తారు.

డయేరియాపై అప్రమత్తంగా ఉండాలి

మున్సిపల్ ఆర్‌డీ నాగనరసింహారావు



అధికారులతో సమీక్షిస్తున్న మున్సిపల్ ఆర్‌డీ

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలో డయేరియా ప్రబలుతున్న దృష్ట్యా ప్రజలు తగిన జాగ్రత్తలు పాటిస్తూ అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ రీజనల్ డైరెక్టర్, రాజమండ్రి, సీహెచ్.నాగనరసింహారావు అన్నారు. ఈ సందర్భంగా మంగళవారం పట్టణంలో డయేరియా ప్రబలిన ప్రాంతాలను ఆయన పరిశీలించారు. డయేరియా బాధితులను ప్రభుత్వాస్పత్రిలో పరామర్శించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ హరీష్‌ను, జిల్లా మెడికల్ హెల్త్ ఆఫీసర్ నుంచి బాధితుల వివరాలను తెలుసుకున్నారు. స్థానిక 26వ వార్డు కనకదుర్గమ్మగుడి, సాయిబాబా గుడి, ఓవర్‌హెడ్ ట్యాంకు వద్ద మున్సిపల్ కుళాయిల నీటిని టెస్టింగ్ చేసి వాటిపై మున్సిపల్ సిబ్బందికి సూచనలు చేశారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలోని మీటింగ్ హాల్‌లో మున్సిపల్ స్టాఫ్, సచివాలయం ఏఎన్ఎం, శానిటరీ, ఇంజినీరింగ్, మెడికల్ ఆఫీసర్స్‌తో సమీక్ష సమావేశం నిర్వహించారు. డయేరియా పట్ల ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను గురించి ముద్రించిన కరపత్రాలను ఇంటింటికీ అందజేస్తూ ప్రచారం చేయాలని సూచించారు. ప్రజలు కాచి చల్లార్చిన నీటిని తాగాలని, నిల్వ ఉన్న, బయట ఆహారపదార్థాలను తినరాదని, ఇంటి పరిసరాలలో నీరు నిల్వలేకుండా చూసుకోవాలని, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని తెలిపారు. మున్సిపల్ కమిషనర్ నాగమల్లేశ్వరరావు, డీఈఈ శివకోటేశ్వరరావు, ఏఈ హనుమంతరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు ఇలా.. డయేరియా రాదంటే ఎలా ?

- మురుగు కాలువల్లో పైపు లైన్లు
- వ్యర్థాలతో నిండి ముందుకు కదలని మురుగు



ఎర్రకాలువ మురుగునీటిలో వేసిన తాగునీటి పైపులు

జగ్గయ్యపేట అర్బన్: పట్టణం నడిబొడ్డు నుంచి ప్రవహిస్తూ మురుగు కంపుకొడుతూ దోమల ఉత్పత్తి కేంద్రంగా మారిన ఎర్రకాలువ ప్రక్షాళన ప్రశ్నార్థకంగా మారింది. అసలే వర్షాకాలం ప్రారంభం కావటంతో పట్టణ ప్రజలకు డయేరియా, చికెన్ గున్యా, మలేరియా, డెంగీ, టైఫాయిడ్ తదితర వ్యాధులు ప్రబలడానికి కారణంగా ఉన్న ఈ కాలువ దోమలకు ఆవాసంగా మారింది. కాలువ దుర్గంధం వెదజల్లుతూ ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది.

120 ఖాళీ స్థలాలు..

గృహాల మధ్య ఉన్న ఖాళీ స్థలాలు అపరిశుభ్రంగా వ్యాధులకు నిలయంగా మారాయి. పట్టణంలో పలు ప్రాంతాలలో గృహాల మధ్య సుమారు 120 వరకు ఖాళీ స్థలాలు ఉండటంతో వీటిలో దోమలు విపరీతంగా వృద్ధి చెందుతున్నాయి. ఊర చెరువుకు సప్లయ్ చానల్‌గా ఉన్న వేపలవాగు కూడా పిచ్చిమొక్కలు, తూటికాడతో నిండిపోయి దోమల ఉత్పత్తికి కేంద్రాలయ్యాయి. పురపాలక సంఘం స్పందించాలని ప్రజలు కోరుతున్నారు.

మురుగు కాలువల్లో తాగునీటి పైపులు..

పురపాలక సంఘం ఇంజినీరింగ్ విభాగం వారు తాగునీరు సరఫరా చేసే పైపులను అనేక చోట్ల డ్రెయిన్లలో నుంచి, ఎర్రకాలువలో నుంచి ఏర్పాటు చేశారు. తాగునీటి పైపులైన్లు అనేక చోట్ల లీకేజీలు కావడంతో కాలువల్లో మురుగునీరు పైపులలో చేరి కలుషితం అవుతోంది. వీటిని తాగిన ప్రజలు డయేరియా వంటి వ్యాధులకు గురవుతున్నారు. గ్రామాల్లో డయేరియా వ్యాప్తికి ఇది ముఖ్య కారణమని వైద్యులు అంటున్నారు.

ఆస్పత్రి వ్యర్థాలు ఎర్రకాలువలోకే..

స్థానిక కోదాడ రోడ్డులో బేతస్త చర్చి పక్కన ఉన్న వెంకట సన్నీ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ వ్యర్థాలను ఎర్రకాలువలో పడవేస్తున్నారని, దీంతో ఆ వ్యర్థాల కంపు భరించలేకపోతున్నామని ఎర్రకాలువకట్ట వాసులు ఆందోళన చేశారు. ఆ వ్యర్థాలతో నిండిపోయిన నీరు ముందుకు కదలడం లేదని, చుట్టుపక్కల వారు కూడా తమ గృహాలలోని వ్యర్థాలను ఎర్రకాలువలో పడవేయడంతో మేట వేస్తోంది.



ఎర్రకాలువలో పడవేసిన ఆస్పత్రి వ్యర్థాలు



ఆందోళన చేస్తున్న ఎర్రకాలువ కట్ట మహిళలు

దోమల బాధ భరించలేక పోతున్నాం



ఎర్రకాలువ అంతా గుర్రపుడెక్కతో, వ్యర్థాలతో నిండిపోయి ఉండటంతో దోమలు వృద్ధి చెంది, భరించలేని కంపు కొడుతుంది. దోమలు కూడ వృద్ధిచెంది రాత్రులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాము. తరచూ అంటువ్యాధుల బారీ పడుతున్నాము. మున్సిపాలిటీ వారు కాలువను శుభ్రం చేయించి దోమల మంది తరచూ పిచికారీ చేయాలి.

–దేవరకొండ వీరస్వామి, ఎర్రకాలువ కట్ట వాసి

ప్రమాదకరంగా ఆస్పత్రి వ్యర్థాలు



ఎర్రకాలువలో చుట్టు పక్కల వారు వ్యర్థాలు పడవేడయంతో మురుగునీరు ప్రవహించడం లేదు. కోదాడ రోడ్డులో ఉన్న వెంకట సన్నీ ఆస్పత్రి వారు వ్యర్థాలను ఎర్రకాలువలో పడవేస్తుండటంతో మందుల కంపు భరించలేకపోతున్నాం. సూదులు వంటి ప్రమాదకర వస్తువులు కూడా పడవేస్తున్నారు. మా ఇళ్ల ముందు కాలువ అంతా సెలైన్ బాటిళ్లతో నిండిపోయింది. దీనివల్ల మురుగు ముందుకు కదలటంలేదు.

–షేక్ వలీ, కాలువకట్ట వాసి

గణపతి ఆలయాల్లో ప్రత్యేక పూజలు



నందిగామ: సంకటహర చతుర్థి నేపథ్యంలో మంగళవారం పలు గణపతి ఆలయాలలో విశేష పూజలు జరిగాయి. పట్టణంలోని పాత బస్టాండ్‌లో పురాతన గణపతి ఆలయంలో స్వామివారికి పలు రకాల సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహించారు. పట్టణంలోని పలు గణపతి ఆలయాలు, మండలంలోని పలు గ్రామాలలో గణపతి ఆలయాలలో విశేష పూజలు జరిగాయి. ఆయా ఆలయాలలో జరిగిన పూజా కార్యక్రమాలలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.